
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 మార్చి 2025
5
కాకినాడ



## నేడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం


ముప్పన వీర్రాజు

ఎపి రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం 9వ తేదీ ఉదయం ముప్పన రామారావు చేనేత సహకార సంఘ భవనంలో జరుగుతుందని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరుగుతుందన్నారు. దేవాంగుల ఆర్థిక, సామాజిక స్థితిగతులు, చేనేత రంగం ప్రస్తుత పరిస్థితి, చేనేతల ఉపాధి అభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

# స్థానిక సమస్యలపై పోరాటం

### ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, తాళ్లరేవు

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలంతా పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో రెండు రోజులపాటు సాగిన ప్రజాచైతన్య యాత్ర శనివారంతో ముగిసింది. రెండు రోజుల పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరికొంత మంది స్వచ్ఛందంగా సిపిఎం బృందం వద్దకు వచ్చి సమస్యలను ఏకరువు పెట్టారు.

శనివారం తాళ్లరేవు మండలం సీతారామపురం నుంచి యాత్ర ప్రారంభమైంది. మాధవరాయునిపేట, రెడ్డివారిపేట, పోలేకుర్రు, తోటపేట, తూర్పు పేట, పి.మల్లవరంలో చిన్నపేట, గ్రాంటు, నీలపల్లి తదితర గ్రామాలలో యాత్ర సాగింది. మాధవరాయునిపేటకు చెందిన టి.ఆదిలక్ష్మి, కుందుర్తి చిట్టెమ్మ, కె.లక్ష్మి, నాగలక్ష్మి మాట్లాడుతూ డ్రైనేజీ, రహదారులు, కొళాయిలు లేవని తెలిపారు. తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. 30 ఏళ్లుగా 60 ఎకరాల రాజీ గారి భూములను సాగు చేస్తున్నప్పటికీ నేటికీ పట్టాలు ఇవ్వలేదని సాగు చేసుకుంటున్న దున్నా కొండబాబు, కన్నీటి లక్ష్మణరావు తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పట్టాలు ఇప్పించాలని కోరారు. సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని పోలేకుర్రు పంచాయతీ తూర్పు పేట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టామని తెలిపారు. మురుగునీరు పారక దుర్వాసనలోనే జీవిస్తున్నామని పి.మల్లవరం చినపేటకు చెందిన రామకృష్ణ, దడాల ఉమామహేశ్వరి, బద్ది తలుపులమ్మ తదితరులు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం మల్లవరం మెయిన్ గ్రాంటు గ్రామం వెళ్లే కాలువను పత్తి గొంది వంతెన వద్ద శ్రీనివాసరావు పరిశీలించారు. కొళాయిలు లేక తాగునీరు అందటంలేదని పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని బందాలవం కాలనీ వాసులు కొప్పిశెట్టి లక్ష్మి రాజేశ్వరం, పిల్ల సూర్యకాంతం, పిల్లి లక్ష్మి తెలిపారు. ఇక్కడ 20 వరకూ ఇళ్లు ఉన్నాయని, నాన్ లేఅవుట్ కావడం వల్ల సౌకర్యాలు కల్పించలేమని పంచాయతీ అధికారులు చెబుతున్నారని తెలిపారు. అనంతరం నీలపల్లిలోని అమరవీరుల స్తూపానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అనంతరం నీలపల్లిలో దళితుల శ్మశానాన్ని పరిశీలించారు. ముంపు సమస్య నుంచి శ్మశానాన్ని కాపాడాలన్నారు. ఇంజరంలో తాత్కాలిక వంతెనను పరిశీలించారు. దీనివల్ల సాగునీరు సక్రమంగా అందడం లేదని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు వీర వెంకట సత్యనారాయణ, సత్తిబాబు తదితరులు తెలిపారు. రత్నవారిపేటను బృందం సందర్శించింది. ఇక్కడితో యాత్రను ముగించారు.


పి.మల్లవరం పంచాయతీ చిన్నపేటలో సమస్యలపై వినతిపత్రాలు అందిస్తున్న స్థానికులు


రత్నవారిపేటలో అధ్వాన్నంగా ఉన్న పారిశుధ్యాన్ని పరిశీలిస్తూ...


సైకిల్ యాత్రలో సిపిఎం బృందం

**ప్రజా సమస్యలపై ఉద్యమం : వి.శ్రీనివాసరావు**

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని, దీనిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తాళ్లరేవు మండలంలో సాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తున్నారు తప్ప తర్వాత పట్టించుకోవట్లేదని విమర్శించారు. స్థానికంగా 10 ఎకరాల అసైన్డ్ భూములున్నా వాటిని పేదలకు పంచకపోవడంలో పాలకులు అడ్డుకుంటున్నారన్నారు. రత్నవారి పేటలో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గోదావరిలో కాలుష్యం కారణంగా చేపల వేటకు దూరమయ్యారన్నారు. వారందరూ వలసకూలీలుగా మారిపోయారన్నారు. వెంటనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. స్థానిక సమస్యలపై ప్రజలను పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సైకిల్ యాత్రలో సిపిఎం నాయకులు ఎం.రాజశేఖర్, టేకుమూడి ఈశ్వరరావు, కెవిఎస్.శ్రీనివాస్, సిహెచ్.రమణి, డి.క్రాంతికుమార్, కె.సింహాచలం, టి.రాజా, జగదీశ్వరరావు, మహేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న రైతులు.

## సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

**-ఏపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మద్దతు**

ప్రజాశక్తి - తాళ్లరేవు (కాకినాడ జిల్లా)

రబీ సాగుకు అవసరమైన సాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటు, మూలపాలెం, పత్తిగొంది, రాంజీనగర్ ప్రాంతాలకు చెందిన రైతులు ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులు ఎవరూ కార్యాలయంలో లేకపోవడంతో 216వ నెంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. సాగునీరు అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని ఆదేశించారు. దీంతో రైతులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇరిగేషన్ అధికారులను రప్పిస్తానని ఎస్ఐ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడారు. ప్రతి ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారన్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్నా. ఈ సమయంలో సాగునీటిని సరఫరా చేయకపోవడంతో పంటను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సాగునీరు అందిస్తామని అధికారులు హామీతోనే రైతులు పంటలు వేశారని, ఈ సమయంలో అధికారులు పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. ఒఎన్జిసి, రిలయన్స్ వంటి పరిశ్రమలకు సాగునీరు తరలిస్తూ రైతాంగానికి అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. వెంటనే సాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కాకరపల్లి వెంకటేశ్వరరాజు, దంగేటి రామకృష్ణ, గంజా శ్రీనివాసరావు, మేడిశెట్టి శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, వాసంశెట్టి రామకృష్ణ, పాలెపు ఈశ్వరరావు, వైదాడి ధర్మారావు, దంతులూరి వెంకటసుబ్బరాజు, పెద్ద ఎత్తున కౌలు రైతులు పాల్గొన్నారు.


రైతులకు మద్దతు తెలుపుతున్న వి.శ్రీనివాసరావు

**సాగునీరు అందించకపోతే ఆందోళన ఉధతం**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు**

పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాళ్లరేవు నీటి పారుదల శాఖ ఎఇఇ కార్యాలయం వద్ద రైతులు నిర్వహించిన రాస్తారోకోకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. శివారు ప్రాంత పొలాలకు నీరందేలా చూడాలన్నారు. సాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

### మహిళా దినోత్సవ సభలో మంత్రి నారాయణ - విజేతలకు బహుమతులు పంపిణీ

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జరిగిన మహిళా దినోత్సవ సభలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పి.నారాయణ పాల్గొన్నారు.**

ప్రజాశక్తి - యంత్రాంగం

**కాకినాడ** ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ వ్యాపార వేత్తగా, పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పి.నారాయణ అన్నారు. శనివారం స్థానిక రాజాట్యాంక్ ప్రాంగణంలోని ఫేబ్ కన్వెన్షన్ హాలులో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, డిఆర్‌డిఎ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ జిల్లా స్థాయి వేడుకను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు, ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, నిమ్మకాయల చిన్నరాజప్ప, జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ మేయర్ సుంకర పావని, ఎస్‌పి జి.బిందుమాధవ్, నగర పాలక సంస్థ కమిషనర్ భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, అమ్మను పూజించు, భార్యను ప్రేమించు, సోదరిని దీవించు అనేది మనందరి నినాదం కావాలన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలు స్వతంత్రంగా తమ కాళ్లపై తాము నిలబడేలా అన్నింటా ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. అనంతరం మహిళా సంఘాలకు రుణాల చెక్కలను పంపిణీ చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి మనీష్ పాటిల్ దేవరాజు, ట్రైనీ ఐపిఎస్ అధికారి సుస్మిత, డిఆర్‌ఒ జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేసిన పలువురు విఒలు డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు చేతుల మీదుగా పశంసా పత్రం, మెమెంటోలు అందుకున్నారని ఎపిఎం తౌడు తెలిపారు. మండలానికి చెందిన విఒలు సాక నిర్మల, పి.అనూష, పంపుతమ్మ, పి.గౌరీ, క్లస్టర్ కోఆర్డినేటర్ అజ్జమ్మ సామర్లకోటలో జరిగిన మహిళా దినోత్సవంలో అవార్డులను అందుకున్నారు. **గొల్లప్రోలు** మండలంలోని చేబ్రోలులో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి సుస్మితా రామనాథన్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ జె.రాజేశ్వరి, గైనకాలజిస్ట్ ఆర్.సరస్వతి, అడ్వకేట్ ఎ.దేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ ,టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, జెవివి సమత కన్వీనర్ సిహెచ్ఇఆర్.మంగతాయారు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** కొవ్వూరు సెక్టార్ అంగన్‌వాడీల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో జరిగింది. సిహెచ్.విజయ అధ్యక్షతన జరిగిన సభలో హెల్త్ అడ్వైజర్ రాబర్ట్ రవిచంద్ర, సిడిపిఒ వై.లక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** స్థానిక బార్ అసోసియేషన్, సదా మీ సేవ సంస్థ, అఖిల్ కాలేజీల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.విజయ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు. **కరప** వేలంగి సర్పంచ్ సవిలే నీలిమ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యారంగంలో సేవలందిస్తున్న జి.సుజాత, గిడితూరి వీరవెంకటవిజయలక్ష్మి, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తప్పెట్ల పృథ్వీరాజ్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, ట్రస్ట్ ఆఫ్ బొండా ఛైర్మన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, సామాజిక వేత్త సవిలే రాజేష్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక ప్రభుత్వాసుపత్రి మహిళా వైద్యులను, వైద్య సిబ్బందిని ఘనంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ సభకు యుటిఎఫ్ ఉమెన్ అసోసియేట్ ప్రెసిడెంట్ అరుణశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా డివైఇఒ ఈరంకి ప్రభాకరశర్మ, ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితలు పోటీలు, ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక మట్టే ఆదినారాయణ, నాగరత్నమ్మ ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో మట్టే సూర్య కమల, మట్టే విద్యుల్లత అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవ సభలో వివిధ రంగాలలో సేవలందించిన డాక్టర్ స్రవంతి, డాక్టర్ జగదాంబ, ఎంపిడిఒ డి.శ్రీలలిత, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ లను ఘనంగా సన్మానించారు. **తుని** స్థానికంగా నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఎంఎల్ఎ యనమల దివ్య పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యనమల రాజేష్, కుసుమతి శోభారాణి, చింతమనేడు అబ్బాయి, మోత్కూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** సురంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్ వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థులు పాల్గొన్నారు. **సామర్లకోట** మెప్మా ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ కమిషనర్ ఎ. శ్రీవిద్య జనసేన నాయకురాలు పెంకె వెంకటలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురు మహిళా ఉద్యోగులను, ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రా దేవి, మహిళా కౌన్సిలర్లు గొర్రెల విజయలక్ష్మి, కాళ్ళ శ్యామల, పాళిక కుసుమ చంటిబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఐసిడిఎస్ పరిధిలో అంగన్‌వాడీలకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన అంగన్‌వాడీలు ఎంవి.శ్రీలక్ష్మి, వి.వెంకటలక్ష్మి, టి.నాగ మణి, కె.అనిత, అమలావతి, నాగలక్ష్మి, భవాని మంత్రి నారా యణ చేతుల మీదుగా జ్ఞాపికలు అందుకున్నారు.


సామర్లకోటలో ఛైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న మహిళలు


ఆదిత్య మహిళా సిబ్బందిని సత్కరిస్తున్న ప్రతినిధులు



తునిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ యనమల దివ్య


సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

## మహిళలకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మహిళలకు భద్రత కల్పించే సంక్షేమ రాజ్యం రావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రజాసంఘాల భవనంలో ఐద్వా శ్రామిక మహిళ శాఖ ఆధ్వర్యంలో కె.ఈశ్వరిబాయి అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభా పాలసీ ద్వారా ఎక్కువమంది సం తానాన్ని కనాలని ప్రభుత్వం చెబుతుందని, ఆ పాలసీలో ఏ మేరకు మహిళలకు భద్రత కల్పిస్తారో స్పష్టం చేయాలని అన్నారు. పుట్టిన పిల్లలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనంతో పని చేసే కార్మికులు లభ్యమవుతున్నారని చైనా వంటి దేశాలు వియత్నాం, మలేషియా వంటి దేశాల్లో పరిశ్రమలు స్థాపి స్తున్నాయని అన్నారు. దీనివల్ల పెట్టుబడిదారీ కంపెనీలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఐద్వా రాష్ట్ర మహిళా నాయకురాలు సిహెచ్.రమణి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్.కళావతి మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు వి.నగోమి, నాగలక్ష్మి, అనంతలక్ష్మి, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.





బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న చేయూత సంస్థ ప్రతినిధులు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన వీర విజయలక్ష్మి, సత్యనారాయణ దంపతులకు నెలలు నిండకుండా జన్మించిన కవలల వైద్యం ఖర్చుల కోసం చేయూత స్వచ్ఛంద సంస్థ రూ.70 వేల సాయం అందించింది. చేయూత సంస్థ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణ మూర్తి, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, అలీమ్‌లతోపాటు సభ్యుల నుంచి సేకరించిన నగదును చెక్కు రూపంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత మహిళా విభాగం సభ్యులు డేగల లక్ష్మి, పరసా ఝాన్సిశేషుకుమారి, మాధవి, రమాదేవి, కుమారి పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చిన జగ్గంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింత తల్లుల ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఐసిడిఎస్ ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహార పదార్థాలను, హోం రేషన్ పరిశీలించి రక్తహీనత, మాల్ న్యూట్రిషన్ మీద అర్నెస్ ఇచ్చి ప్రసవ ప్రణాళిక సురక్షిత ప్రసవం ప్రసూతి జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

## అనాథ మృతుని పేరిట అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన అనాథ కిర్లంపూడి సూర్యనారాయణ పేరిట వివేకానంద సేవా సమితి సభ్యులు శనివారం ఆసుపత్రి ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి ఛైర్మన్ మైరాల నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్‌లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్, స్థానిక నాయకులు బుగత శ్రీను, సామంతుల గోపి, గొల్లపూడి త్రిమూర్తులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న సమితి ప్రతినిధులు

## రూ.5.35 కోట్లతో రహదారుల నిర్మాణం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలో రూ.5.35 కోట్లతో రహదారుల నిర్మాణాలను చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఎవి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన సింహాద్రిపురం, భూపాల్‌పట్నం, వీరవరం గ్రామాలకు చెందిన రహదారుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయా పనుల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని అన్నారు. ఈ పర్యటనలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు డి.ఉమాశంకర్, నారాయణ, కాంట్రాక్టర్ రమేష్ సిద్ధు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

## మండలంలో పి4 సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో శనివారం పి-4 సర్వే ప్రారంభమైందని ఎంపిడిఒ డి.శ్రీ లలిత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పీపుల్, పబ్లిక్, ప్రయివేట్ పార్ట్నర్ షిప్‌తో పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి నిర్దేశించిన ఈ సర్వేను సచివాలయ సిబ్బంది వారం రోజులపాటు నిర్వహిస్తారన్నారు. 27 ప్రశ్నలతో కూడిన ఈ సర్వే ద్వారా ప్రతి కుటుంబం ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు నమోదు చేస్తారన్నారు. పేద కుటుంబాలను గుర్తించి వారిలో 20 శాతం కుటుంబాలను ఎంపిక చేసి ప్రతి ఏడాది వారి ఆర్థిక స్థితిగతులు 20 శాతం పెరిగేందుకు పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వారి సహాయ సహకారాలతో కృషి జరుగుతుందన్నారు.

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

**ప్రజాశక్తి - తాళ్లరేవు**

మండలంలోని ఇంజరం సమీపంలోని యానం - ద్రాక్షారామ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థి తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..కాకినాడ ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమంలో వారి వద్ద మద్యం సీసాలు ఉన్నాయి. దీంతో సుంకరపాలెం ఎక్సైజ్ సిబ్బంది విద్యార్థులను వెంబడించారు. దీంతో ఆ విద్యార్థులు వారి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనం వేగాన్ని పెంచారు. ఈ నేపథ్యంలోనే ద్రాక్షారామ వైపు నుంచి వస్తున్న లారీని విద్యార్థులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కరప మండలం అడవిపూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్ (21) తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు కాకినాడ జిజిహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మరో విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎక్సైజ్ పోలీసులు విద్యార్థులను వెంబడించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థి కుటుంబ సభ్యులు, స్థానికులు సుంకరపాలెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ముట్టడించారు. దీంతో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటనా స్థలానికి కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, స్థానిక నాయకులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

## వివాహితపై కత్తితో దాడి

**ప్రజాశక్తి - ముమ్మిడివరం**

వివాహిత మహిళపై ఒక వ్యక్తి కత్తి తో దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అనాతవరం గ్రామం ఎదురుమూడి పుంత గ్రామానికి చెందిన పంతగంటి జయ రామకృష్ణ తమ పక్కింటిలో నివాసముంటున్న చాట్ల మాలతి పై శనివారం కత్తితో దాడి చేశాడు. జయ రామకృష్ణ భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ ఉంటోంది. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మాలతికి భర్త కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం మధ్యాహ్నం మాలతి ఇంటి నుండి బయటకు వెళుతున్న సమయంలో ఆ చుట్టుపక్కల పిల్లలు అల్లరి చేస్తుండగా ఆమె వారిని మందలించింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న జయ రామకృష్ణ కోపంతో కత్తితో మాలతిపై దాడి చేశాడు. దాడికి గురైన మాలతి అపస్మారక స్థితికి చేరడంతో ఆమెకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

**ప్రజాశక్తి - ఆలమూరు**

మద్యం మత్తులో వాహనం నడుపుతున్న వ్యక్తిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరచగా జడ్జి నెల రోజులు జైలు శిక్ష విధించారు. సాధారణ వాహన తనిఖీలలో భాగంగా మండలంలోని చెముడులంకకు చెందిన మజ్జి రాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. దీంతో అతనిని అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచామన్నారు. జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ నిందితుడు రాజుకు నెల రోజులు జైలు శిక్ష విధించినారని ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**ప్రజాశక్తి - గొల్లప్రోలు**

పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక బాలుర హైస్కూల్ వద్ద పట్టణానికి చెందిన విత్తనాల దొంగ అబ్బాయి కల్లు గీసుకుని వస్తుండగా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను గాయాలపాలయ్యాడు. వైద్యం నిమిత్తం పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.



చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

## రూ 4.65 కోట్ల చెక్కుల పంపిణీ

**ప్రజాశక్తి - పెద్దాపురం**

పట్టణ పరిధిలోని 36 డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ పథకం ద్వారా మంజూరైన రూ.4.65 కోట్ల రుణాల చెక్కులను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పంపిణీ చేశారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయంలో మెప్మా సిఎంఎం భ్రమరాంబ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ఈ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గెద్దం పెదకాపు, సిఒలు నర్గీస్, శ్రీదేవి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి మంగరాజు, పూల భవానీలక్ష్మి, ఉపాధ్యక్షులు బిహెచ్.మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## స్వమిత్వపై డివిజన్ స్థాయి శిక్షణ

**ప్రజాశక్తి - పెద్దాపురం**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వమిత్వ' సర్వేపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో డిపిఒ రవికుమార్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సకాలంలో ఈ సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి సంబంధించిన అన్ని వివరాలు ఈ సర్వేలో నమోదవుతాయన్నారు. డివిజన్లోని 11 మండలాల్లో ఒక్కొక్క మండలం నుంచి 10 మంది చొప్పున 110 మంది పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిఒటి సాయిరాం పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై చైతన్యం

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

స్థానిక సమస్యలపై ప్రజలను చైతన్యం చేసేందుకు సిపిఎం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రజా చైతన్య యాత్రలను ప్రారంభించింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో జరిగిన ప్రజా చైతన్య యాత్రలో స్వయంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు ఆ మండలంలో పల్లెగ్రామాల్లో సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక సమస్యలపై అధ్యయనం చేస్తూ... ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా సిపిఎం బృందం వద్దకు వచ్చి సమస్యలను ఏకరువు పెట్టారు. పలుచోట్ల స్థానికులు వినతిపత్రాల రూపంలో వారి సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనుకున్న దానికంటే ప్రజల నుంచి ఈ యాత్రకు అనూహ్య స్పందన వచ్చింది. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నామని, ఓట్లకు మాత్రమే తమను వినియోగించుకుంటున్నారని, ఆపై గాలికొదిలేస్తున్నారని పాలకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. కనీసం తాగునీరు కూడా అందించని స్థితిలో ప్రభుత్వం ఉందని పలువురు వాపోయారు. మొత్తంగా స్థానిక సమస్యలపై ఉద్యమానికి సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం నుంచి ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమైంది. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఆధ్వర్యంలో సిపిఎం నాయకుల బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంది.

మరో పక్క కూటమి ప్రభుత్వం తన గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తోంది. సమస్యలు పరిష్కరించాలని పోరాటానికి దిగిన వారిపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ వారంలో జరిగిన ఆశాల నిర్బంధమే దీనికి నిదర్శనం. పని ఒత్తిడి తగ్గించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అందించాలనే తదితర డిమాండ్లతో ఆశా వర్కర్స్ యూనియన్ 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా జిల్లా నుంచి విజయవాడకు సొంత ఖర్చులతో బయలుదేరిన ఆశాలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. మహిళలని కూడా చూడకుండా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గత సర్కారు ఇదే విధానాలను అవలంబిస్తే వ్యతిరేకించిన కూటమి నాయకులు, ఇప్పుడు వారే పాలకులుగా ఉండి అరెస్టులు చేయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

**రబీ సాగుకు నీటి గండం**

రబీ సాగుకు నీటిగండం మొదలైంది. గోదావరి నది పరివాహక ప్రాంతం కావటంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విధితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి రెండు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్థత వైఖరిని అత్యధికంగా చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రతి ఏటా వేసవి పనులు నిర్వహించి కాల్వల ఆధునీకరణ, తూడు కాడ తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించడం దశాబ్ద కాలంగా ఆనవాయితీగా వస్తోంది. డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు రాష్ట్ర ప్రభుత్వం ఆటకెక్కించింది. వ్యవసాయ రంగంలో కీలకమైన నీటి వనరులు నిల్వ చేసుకోవాలనే ముందుచూపు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది. తాజాగా వంతుల వారీ విధానంలో నీరు శివారు పొలాలకు చేరక రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాల్వల ఆధునీకరణ చేపట్టాలి. ఇప్పటికే సాగునీటి కోసం కాకినాడ జిల్లా తాళ్లరేవులో రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వం స్పందించకుంటే మిగిలిన ప్రాంతాల్లోనే ఇదే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంది.

వేసవి ఉష్ణోగ్రతలు జిల్లా వాసులను హడలెత్తిస్తున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరాసరిన 38 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం జిల్లా కేంద్రాలతో పాటు ఇతర పట్టణాలు, పల్లెల్లో సైతం వడగాల్పులు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ముఖ్య కూడళ్లు వెలవెలబోతున్నాయి. రానున్న కాలంలో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందనే వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.




# యానాం వార్తలు


నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న న్యాయవాదులు

## మిల్క్ బాయిలర్స్ ఆందోళన విరమణ

**ప్రజాశక్తి - యానాం**

వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కారం కోరుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా చేపట్టిన ఆందోళన శనివారం సాయంత్రం విరమించారు. పుదుచ్చేరి విద్యాశాఖ ఉన్నతాధికారులు రూ.10 వేలు నుంచి రూ.18 వేలు వేతనాలు త్వరలో పెంచుతామని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. దీక్షా శిబిరాన్ని న్యాయవాదులు సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆందోళనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కమిడి విజయ్‌కుమార్, అన్నంపల్లి ఉషారాణి, స్వరాజ్యలక్ష్మి, భ్రమరాంబిక, మోక్షిత పాల్గొన్నారు.

## ఓల్డేజ్ హోం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

**ప్రజాశక్తి - యానాం**

పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదేశాలతో ఓల్డ్ ఏజ్ హోం ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులను చేపట్టారు. సుమారు 20 ట్రాక్టర్లు, వందమంది సిబ్బందితో చెత్తను తొలగించారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మల్లాడి కృష్ణారావు తెలిపారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

**ప్రజాశక్తి - యానాం**

యానాంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పోలీస్ స్టేషన్లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఎస్పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, శేరు నూకరాజు పాల్గొన్నారు. పలువురు మహిళలను సత్కరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సావిత్రి నగర్, కనకాలపేట గ్రామాలకు చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే మిల్క్ బాయిలర్స్ సిబ్బంది ఆందోళనకు సంఘీభావం తెలిపారు. దీక్షలో ఉన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, శ్రీమంతుల శ్రీధర్, పైడి కొండల రాజాబాబు, చెక్కల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా సింహ వాహనోత్సవం

**ప్రజాశక్తి - యానాం**



లడ్డూను అందిస్తున్న ఉపాధ్యాయులు

యానాంలో శనివారం సింహ వాహనోత్సవం ఘనంగా జరిగింది. యానాం వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా యానాం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ క్యాక్రమాన్ని నిర్వహించారు. ఆయా వీధులలో రథంపై కొలువైన మీసాల వెంకన్నను భక్తులు దర్శించుకుని పూజలు చూశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంజిజి బాలుర ఉన్నతపాఠశాలలో స్వామివారి అభిషేకం లడ్డుకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కెఎన్.లక్ష్మి రూ.11,500కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, డిటి జ్యోతి వెంకటేశ్వరరావు ఆమెను సత్కరించి అభినందించారు.

# పదో తరగతి తొలి మెట్టు

**ప్రజాశక్తి - కాకినాడ**



జిల్లాస్థాయి విజేతలతో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రతీ విద్యార్థికి 10వ తరగతి తొలి మెట్టు లాంటిదని పలువురు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయు ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా వ్యా ప్తంగా నిర్వహించిన 10వ తరగతి పరీక్షల్లో పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ సభ శనివారం యుటిఎఫ్ హోంలో జరిగింది. ఈ కార్య క్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు నాగ మణి మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధస్సు వెలికి తీయడం కోసం ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యం లో నిర్వహించిన పరీక్ష ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్యార్థి జీవితంలో 10వ తరగతి తొలిమెట్టు లాంటిదని, ఆ మెట్టు ఎక్కిని విద్యార్థులందరూ సఫలీకృతం అవుతారని అన్నా రు. ఎఫ్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో బాగా చదివి రాణించడమే కాకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు ఉన్న మేధస్సును వెలికి తీయడం కోసం గత 14 సంవత్సరాల నుంచి ఈ పరీక్షలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. జిల్లా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సిహెచ్. రాకేష్ (కాకినాడ), కౌశిక్ కార్తిక్ (సామర్లకోట), వివిఎస్ఎల్ తేజశ్రీ( పెదపూడి) నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎ ఫ్ఐ నాయ కులు సిద్ధు, గోపాలకృష్ణ, లలిత, చిన్ని, లోవరాజు, అరుణ్ కుమార్, నాని, జైరామ్, సంతోష్, పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

**ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం**



పెద్దాపురంలో మాట్లాడుతున్న జడ్జి చంద్రమౌళీశ్వరి

స్థానిక కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 171 కేసులు పరిష్కారమయ్యాయని 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి తెలిపారు. మొదటి బెంచ్‌కు 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్ర మౌళేశ్వరి అధ్యక్షులుగా, న్యాయవాది వి.సత్యవతి సభ్యులుగా, 2వ బెంచ్ కు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె.దీపదైవకృప అధ్యక్షులుగా, న్యాయవాది బి.వి పద్మాసని సభ్యులుగా, 3వ బెంచ్‌కు కాకినాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిరూపభంజ్‌డియో అధ్యక్షులుగా, న్యాయవాది ఎస్.మురళీ శ్రీనివాస్ సభ్యులుగా వ్యవహరించారు. పరిష్కారమైన 171 కేసులులో సివిల్ 24, క్రిమినల్ 69, మోటార్ ప్రమాద కేసులు 1, ప్రీ లిటిగేషన్ బ్యాంకు కేసులు 5, ప్రీ లిటిగేషన్ బిఎస్ఎన్ఎల్ కేసులు 6, మనోవర్తి కేసులు 4, సారా కేసులు 62 ఉన్నాయని చంద్రమౌళీశ్వరి తెలిపారు. పిఠాపురం కోర్ట్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్‌లో 299 కేసులు పరిష్కారం అయాయ్యని 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి తెలిపారు. తొలుత కోర్ట్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. అనంతరం జాతీయ లోక్ ఆదాలత్‌ను నిర్వహించారు. నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఆయా బెంచ్‌లకు 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. విజయరామేశ్వరి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వి.అపర్ణ అధ్యక్షత వహించారు. మొత్తం 398 కేసులు రాగ వాటిలో ఎంఇఒపి, సివిల్ దావాలు, క్రిమినల్ కేసులు, ఎన్ఐ యాక్ట్‌లు మొత్తం 299 కేసులు పరిష్కారం అయ్యాయి.

## డాక్యుమెంట్లు పడిపోయినవి

తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం సూదికొండ గ్రామానికి చెందిన లంకనూకరాజు S/o ఎర్రబ్బాయి సూదికొండ గ్రామం నుండి జిరాక్స్ నిమిత్తం సూదికొండ నుండి గోకవరం వస్తుండగా మార్గ మద్యలో పడిపోయాయి. సర్వేనంబరు-118, డాక్యుమెంట్ నెంబర్ 942/1995 పడిపోయినవి ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబరు తెలుపగలరు

**ఫోన్ నెం.9391861949**

# ఆవిర్భావ సభ ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాశక్తి - పిఠాపురం**


సభా ఏర్పాట్లును పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మండలంలోని చిత్రాడలో ఈ నెల 14వ తేదీన నిర్వహించే జనసేన పార్టీ 14వ ఆవిర్భావ సభ ఏర్పాట్లను పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం పరిశీలించారు. సభా కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఇతర సభ్యులతో చేస్తున్న ఏర్పాట్లపై సమీక్ష చేశారు. సభకు హాజరయ్యే ఏ ఒక్కరూ ఇబ్బందులు తలెత్తకుండా అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పర్యటనలో శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, శాసన సభ ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# వల్లభస్వామికి రూ.3.55 లక్షల ఆదాయం

**ప్రజాశక్తి - పెద్దాపురం**

మండల పరిధిలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.3,55,197 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్లు ద్వారా రూ.2,60,480, అన్నదాన విరాళాల ద్వారా రూ.56,107, కేశఖండన ద్వారా రూ.7,000, తులాభారం ద్వారా రూ.600, లడ్డు ప్రసాదం ద్వారా రూ.30,810, స్వామి వారి కార్మికుల ద్వారా రూ.200 వచ్చిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.

# అనుమతులను త్వరగా మంజూరు చేయాలి

**ప్రజాశక్తి - కాకినాడ**



అధికారులతో చర్చిస్తున్న మంత్రి నారాయణ

లే అవుట్లు, బిల్డింగ్ నిర్మాణ అనుమతుల కోసం కుడా, నగరపాలక సంస్థ కార్యాలయాలకు వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలని మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక శారదమ్మ గుడి సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంలో కాకినాడ నగరపాలక సంస్థ, కుడా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. తొలుత టౌన్‌ప్లానింగ్, అర్బన్ అథారిటీస్ విభాగాలపై అధికారులతో చర్చించారు. నగరపాలక సంస్థ, కుడా పరిధిలో కన్వర్షన్ ఆఫ్ ల్యాండ్స్, లే అవుట్స్, బిల్డింగ్ ప్లాన్స్ అనుమతులపై ఆరా తీశారు. ఎన్నింటికి అనుమతులు ఇచ్చారు..? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలు ప్రశ్నించారు. నగరపాలక సిటీ ప్లానింగ్ విభాగం అధికారులు ఇచ్చిన సమాధానాలపై మంత్రి మంత్రి నారాయణ లోతైన వివరణ కోరారు. రాష్ట్ర స్థాయి అధికారులతో ఆయన నేరుగా టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడి కాకినాడ నగరపాలక సంస్థ వివరాలను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్, కూడా ద్వారా ఇన్‌కమ్ జనరేట్ చేసుకోవాలిన అధికారులు సూచించారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు సంబంధించి కూడాలో పెండింగ్‌లో ఉన్న 976 దరఖాస్తులను, నగరపాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న 204 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలిం చాలన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువును ఆరు నెలల పెంచాలని మంత్రి సూచించారు. లే అవుట్స్‌కు నాలుగు రోజుల్లో, బిల్డింగ్ పర్మిషన్స్ రెండు రోజుల్లో అనుమతులు ఇవ్వాలని మంత్రి నారాయణ సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎంఎల్ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, కమిషనర్ భావన, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, సెక్రటరీ ఎ శ్రీకాంత్ రెడ్డి, ఎంహెచ్ఒ డి.పృథ్వీచరణ్, సిటీ ప్లానర్ రామచంద్ర రావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.